www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 24 ఆగస్టు 2024

మెనూ సక్రమంగా అమలు చేయాలి

జిల్లా బిసి సంక్షేమ అధికారిణి నాగరాణి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మాట్లాడుతున్న నాగరాణి

ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న మెనూ సక్రమంగా అమలు చేయాలని జిల్లా బిసి సంక్షేమ అధికారిణి ఆర్‌వి.నాగరాణి అన్నారు. ముదినేపల్లిలోని బిసి బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. మెనూను చూశారు. మరుగుదొడ్లు, స్నానపుగదులను, పరిసరాలను పరిశీలించారు. వసతిగృహం వార్డెన్ పి.సురేష్ బాబు పనితీరు పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

సమస్యలు వదిలి.. ప్రతిపాదనలతో సరి

- రెండు జిల్లాల్లో అట్టహాసంగా గ్రామ సభలు
- ఉపాధి పనుల ప్రతిపాదనలకే పరిమితం
- ఏలూరులో రూ.220 కోట్లు పనులకు తీర్మానాలు
- ఉపాధి కూలీల సమస్యలపై కనీస ప్రస్తావన కరువు
- కూలీల సమస్యలపై గ్రామసభల్లో వ్యవసాయ కార్మిక సంఘం వినతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం అట్టహాసంగా శుక్రవారం నిర్వహించిన స్వర్ణ గ్రామసభల్లో ఉపాధి కూలీల సమస్యలపైగానీ, గ్రామాల్లోని ఇతర అంశాలపై గానీ, ఎటువంటి చర్చ లేకుండా పోయిందని, కేవలం ఉపాధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలతో సరిపెట్టారంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ సభలు జరిగిన తీరు సైతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కొన్నిచోట్ల గంటల వ్యవధిలోనే సభలు ముగించి మమ అనిపించిన పరిస్థితి కనిపించింది. ఏలూరు జిల్లాలోని 547 గ్రామ పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో ఈ ఏడాది రూ.220 కోట్లు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, తీర్మానాలు జరిగిన పరిస్థితి నెలకొంది. అత్యధికంగా సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బిటి రోడ్లు వంటి పనులకు సంబంధించిన ప్రతిపాదనలే ఎక్కువగా సాగిన పరిస్థితి నెలకొంది. పలు పనులపై అధికారులు చదివి వినిపించడం, మమ అనిపించడం అన్నట్లు పరిస్థితి కొనసాగింది. ఈ సభలే ముఖ్యంగా ఉపాధి హామీ చట్టంలోని పనులకు సంబంధించినవి అయినప్పటికీ అందుకు సంబంధించిన సమస్యలపై ఎక్కడా చర్చ సాగిన పరిస్థితి లేకుండా పోయింది. ఉపాధి కూలీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామ సభల్లో మంత్రులు, ఎంఎల్ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులంతా పాల్గొన్నారు. ఉపాధి కూలీల పని దినాలపై గానీ,

ముసునూరు మండలం రమణక్కపేట గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

15 రోజులకోసారి ఇవ్వాల్సిన పేస్లిప్పులపైగానీ, ఉపాధి కూలి సొమ్ములు సకాలంలో అందజేయడంపైగానీ, వ్యవసాయానికి ఉపాధి పనులు అనుసంధానం చేయొద్దని కోరుతున్న కూలీల అభిప్రాయాలు వంటి వాటిపై ఎక్కడా ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. గ్రామసభల్లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొని పలుచోట్ల ఉపాధి కూలీల సమస్యలపై మాట్లాడి అధికారులకు వినతులు అందించారు. పలుచోట్ల వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఉపాధి కూలీల సమస్యలపై లేవనెత్తిన అధికారులు సరైన సమాధానాలు చెప్పకుండానే దాటవేసిన పరిస్థితి నెలకొంది. ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సమాచార సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొన్న సభలో కూలీలు పలు సమస్యలను లేవనెత్తారు. ఏడాదికి వందరోజులు పని కల్పించాల్సి ఉన్నప్పటికీ గ్రామంలో సగటున 38 రోజుల నుంచి 50 రోజులు మాత్రమే పని కల్పించడంపై ప్రశ్నించారు. వేసవిలో పని చూపించడం లేదని, సకాలంలో వేతనాలు అందడం లేదని తెలిపారు. పనిచేసిన వేతనంలో కొందరికి వారంలో రూ.800 నుంచి రూ.1200 మాత్రమే చూపిస్తున్నారని, మరికొంత మందికి రూ.1,200 నుంచి రూ.1,800 వరకూ వారానికి సొమ్ములు ఇస్తున్నారని ఈ వ్యత్యాసం ఎందుకు వస్తుందో చెప్పడం లేదన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఉన్నత అధికారులతో విచారణ జరిపి సమగ్రమైన నివేదిక తయారుచేసి, ఎవరు ఏ తప్పు చేశారు పర్యవేక్షణతో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇలా పలుచోట్ల ప్రజలే తమ సమస్యలే మాట్లాడారు. అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ కూలీల సమస్యలపై మాట్లాడిన పరిస్థితి లేకుండా పోయింది. గ్రామ సభల్లో ప్రతిపాదించిన పనులన్నీ కంపోనెంట్ పనులకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. ప్రజలకు ఉపయోగపడే పనులు కాకుండా వ్యక్తిగతంగా ఉపయోగపడే పనులకు ఎక్కువగా అవకాశం కల్పించిన పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామసభల తీరు అందరినీ నిరాశపర్చిన పరిస్థితి ఏర్పడింది.

వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి

ఉపాధి పనులు పెంచాలి

గ్రామ సభల్లో వ్యకాస వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని 21 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. బుట్టాయగూడెం గ్రామసభలో ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ యాదవ్, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీలో భాగంగా ఒక్కో మండలానికి రూ.నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయల చొప్పున రోడ్ల అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అచ్చయ్యపాలెం గ్రామ సభలో అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. గ్రామసభల ద్వారా ఉపాధి నిధులు కేటాయింపు, కూలీల వేతనాలు, పేస్లిప్పులు, పనులు కేటాయింపుల విషయంలో కొన్ని అభ్యంతరాలను మీ దృష్టికి తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయానికి అనుబంధంగా తెస్తున్న పనులను రద్దు చేయాలని, దీనివల్ల గ్రామీణ పేదలకు, వ్యవసాయ కూలీలకు, దళితులు, గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. చెరువు పూడికతీత ఉపాధి హామీ పనుల్లో కేటాయించాలని, పని దినాలు పెంచాలని తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా పని కేటాయింపుల్లో ప్రధాన పనిగా చెరువులు పూడిక, కాలువగట్లు, రోడ్డుకిరువైపులా కాలువల పూడిక వంటి పనులు కేటాయించడం వల్ల కూలీలకు వేతనాలు సకాలంలో అందే అవకాశం ఉందన్నారు. ఈ పనులను ఎత్తివేయడం అంటే ఉపాధి చట్టానికి ఉరివేయడమే అని తెలిపారు. ఉపాధి పనుల్లో చెరువు పూడిక పనులు ప్రధాన పనిగా ఉండేలా పెట్టాలని కోరారు. ఈ పనులు 200 రోజులకు పెంచాలని, రూ.600 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధి'దొరక్కుండా కుట్ర

దెందులూరు : మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పెంచి కార్మికులకు పని దొరక్కుండా చేసే విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు 40 శాతం ఉండాలని, కార్మికులకు 60 శాతం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని దోసపాడు గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఒకేసారి ఉపాధి గ్రామ సభలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. వామపక్షాల పోరాటం ఫలితంగా 2004లో ఈ చట్టం వచ్చిందని తెలిపారు. పనుల్లేని కాలంలో ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించి పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం ఈ చట్టం లక్ష్యమన్నారు. రైతులకు ఉపయోగపడే తాగునీటి చెరువులు, పంట కాలువలు, మురుగు డ్రెయిన్ల ఆధునికీకరణ పనులను ఉపాధి కార్మికులతో చేయించాలన్నారు. జంగిల్ క్లియరెన్స్, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను ఉపాధి హామీ చట్టంలో చేర్చాలన్నారు. ఉపాధి కూలీలకు 15 రోజులకు ఒకసారి పే స్లిప్, వేతనం ఇవ్వాలని, కూలి రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాల అభివృద్ధే ధ్యేయమని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సమాచార సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. శుక్రవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఎంపిడిఒ జి.రాణి, ఉపాధి హామీ మండల శాఖ అధికారుల సమక్షంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో మంత్రి పార్థిసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి కూలీలు పలు సమస్యలు తీసుకొచ్చారు. అనంతరం ఆయన పార్థసారధి మాట్లాడుతూ రమణక్కపేట గ్రామంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయని సిబ్బందిని అడగ్గా 919 జాబ్ కార్డులు ఉన్నాయని, వాటిలో 789 కార్డులదారులు మాత్రమే ఉపాధి పనికి వస్తున్నారని తెలిపారు. అయితే ఒక్కొక్కరూ సగటున 70 నుంచి 90 రోజుల వరకూ పని చేశారా అని అడగ్గా 38 రోజుల నుండి 50 రోజులు మాత్రమే పని కల్పించమని సిబ్బంది చెప్పడంతో మంత్రి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు సిబ్బంది వేసవిలో పని చూపించడం లేదని, కొందరు ఉపాధి కూలీలకు వేతనాలు అందలేదని అదే గ్రామానికి చెందిన ఆముదాల రాజా, మరికొందరు కూలీలు తెలిపారు. స్పందించి మంత్రి ఉన్నతాధికారులతో విచారణ జరిపి సమగ్ర నివేదిక తయారుచేయాలని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజకుమార్, ఉపాధి హామీ మండల అధికారులు, గ్రామస్తులు, టిడిపి, జనసేన, బిజెపి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : స్వర్ణ గ్రామ పంచాయతీలే ధ్యేయమని సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. బోర్వంచలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో మంత్రి పార్థసారధి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 547 గ్రామ పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాలకు అవసరమైన కొత్త పనులు గుర్తించడంలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు గ్రామ సభలు దోహదపడతాయన్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ రహదారులు, మురుగునీటి కాలువలు, పంట కాల్వల పూడికతీయడం, పండ్లతోటల పెంపకం, పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు షెడ్లు నిర్మాణం వంటి పనులను గ్రామ ప్రజలను ఆమోదం ద్వారా చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రూ.20 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బర్మా ఫణిబాబు, సర్పంచి కూటం విజయరాజు, ఎ.సంగీతరావు, మెరుగు శ్రీను పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఎంజిఎన్ఆర్ఇజిఎస్ గ్రామ సభల ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. వట్టిగుడిపాడులో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి యలమర్తి కిరణ్మయి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాల మేరకు పనుల గుర్తింపునకు గ్రామసభ

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

చింతలపూడి : గ్రామాలు అభివృద్ధిలో పయనించాలంటే ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం ద్వారా పనులను చేపట్టడానికి గ్రామ సభలు నిర్వహిస్తుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మండలంలోని ప్రగడవరం గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి తొమ్మండ్రు భూపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ హాజరయ్యారు. గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 547 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజాసౌమ్య పద్ధతిలో గ్రామ సభలు నిర్వహించి గ్రామ అభివృద్ధికి ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు సుపరిపాలన అందించడంలో అభివృద్ధి, సంక్షేమ అమల్లో నిర్మాణాత్మకమైన పాత్రను పోషించే విధంగా గ్రామ ప్రజలు పరిపాలనా విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రగడవరం గ్రామాన్ని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడానికి గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ కృషి చేయాలన్నారు. డెంగీకి సంబంధించిన కేసులు నమోదవుతున్న దృష్ట్యా గ్రామస్తులందరూ అప్రమత్తమై వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి గ్రామ పంచాయతీలు కృషి చేయాలన్నారు. ఏలూరు నీటి యాజమాన్య సంస్థ పీడీ రాము మాట్లాడుతూ కుటుంబానికి ఒకరికి మాత్రమే జాబ్ కార్డులు ఇస్తారని తెలిపారు. గ్రామాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, చెక్ డ్యాంలు, చెరువులు, అంతర్గత రోడ్లు, తదితర 87 రకాల పనులను ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బి.మోహన్ మురళీధర్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

టంగుటూరి ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు, త్యాగనిరతి, నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కొనియాడారు. మండలంలోని ప్రగడవరం గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ చట్టం గ్రామసభకు విచ్చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ముందుగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

వైసిపి జిల్లా అధ్యక్షునిగా 'దూలం'..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా వైసిపి అధ్యక్షునిగా వైసిపి కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావును ఎంపిక చేస్తూ వైసిపి అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీంతో కొద్ది రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఏలూరు జిల్లా వైసిపి అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి ఆళ్లనాని కొద్దిరోజుల క్రితం రాజీనామా చేశారు. అప్పటినుంచి జిల్లా సారథిగా ఎవరిని నియమిస్తారోనన్న చర్చ రాజకీయాల్లో కొనసాగుతోంది. జిల్లా అధ్యక్ష బాధ్యతలు తీసుకునేందుకు నాయకులెవరూ ముందుకు రాకపోవడంతో అధిష్టానం తీవ్ర ఆలోచనలో పడింది. తర్జనభర్జన అనంతరం దూలం నాగేశ్వరరావును ఎంపిక చేసింది. దూలం 2019లో వైసిపి తరపున కైకలూరు ఎంఎల్‌గా పోటీచేసి గెలిచారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌పై పరాజయం పాలయ్యారు. బలమైన కాపు సామాజిక తరగతికి చెందిన నేతగా దూలంకు పేరుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దూలం నాగేశ్వరరావును జిల్లా అధ్యక్షునిగా నియమిస్తే బాగుంటుందని ఆలోచన చేసి నియమించినట్లు తెలుస్తోంది. ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గంటా ప్రసాద్, మామిడిపల్లి జయప్రకాష్ నారాయణ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇన్‌ఛార్జి నియామకంపై రెండు, మూడు రోజుల్లో నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

దూలం నాగేశ్వరరావు

ముస్లిముల సంక్షేమానికి కృషి

బోర్వంచలో మసీదు ప్రారంభోత్సవంలో మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ముస్లిముల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని బోర్వంచ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిముల సంక్షేమానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని చెప్పారు. మసీదులో ఉన్న స్కూలు పిల్లలకు ప్రతి ఏడాది వారి విద్యాబోధనలకు అవసరమైన పుస్తకాలు తమ ఆర్థిక వనరులతో అందిస్తామని తెలిపారు. నూజివీడులో త్వరలో ముస్లిములకు షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ హయాం నుంచి ముస్లిం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అదే విధంగా ప్రస్తుతం ప్రభుత్వం కూడా ముస్లిం సంక్షేమానికి ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. అనాథ పిల్లల కోసం నిర్వహిస్తున్న పాఠశాలకు నిధులు కేటాయించాలని కోరారు. మక్కాకు వెళ్లేందుకు హాజ్ యాత్రకు ప్రభుత్వ పరంగా రూ.లక్ష అందిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బర్మా ఫణిబాబు, దారుల్ ఉలూమ్ మొహమ్మదీయ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, రియాజ్ ఖాద్రి, పాషాఖాద్రి, ఎస్‌కె.మున్నీ రిజ్వాన్, అబ్దుల్ మన్నాన్(రియాజ్), ఎంఎ వజీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

చెబ్రోలు సచివాలయంలో.. ఇసుక స్లాట్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రజలకు ఇసుక అందించేందుకు వీలుగా మండలంలోని చేబ్రోలు సచివాలయంలో ఇసుక స్లాట్ బుకింగ్ కౌంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ తొలుత ఇసుక స్టాక్ యార్డును పరిశీలించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇక్కడ 451 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. చేబ్రోలు సచివాలయంలో ఇసుక కావాల్సిన వారికోసం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించడంలో బుకింగ్ ప్రక్రియ తీరును పరిశీలించేందుకు ఆర్‌డిఒ వచ్చారు. చేబ్రోలుకు చెందిన బూరుగుపల్లి నాగేంద్ర పేరున 20 ఎంటిల ఇసుక కోసం స్లాట్ బుకింగ్ చేసి ఇన్వాయిస్ రశీదు అందజేశారు. ఆన్‌లైన్‌లో ఆప్ పనితీరును డిజిటల్ అసిస్టెంట్ సిహెచ్ అశ్విని ఆర్‌డిఒకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ విలేకర్లతో మాట్లాడుతూ ఇసుక పాయింట్ వద్ద వాహనాలు బారులు తీరి ఉండకుండా, అక్రమ రవాణాను నివారించేందుకు ప్రభుత్వం ఇసుక బుకింగ్ స్లాట్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. చేబ్రోలులో స్టాక్ అంతా సేల్ అయితేనే కొత్తగా స్టాక్ పెట్టేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు చెప్పారు. ఇక్కడి ఇసుక నాణ్యతగా లేదని కేవలం పునాదుల కోసం తప్పా ఇంటి నిర్మాణానికి పనికిరాదని, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి రాంధే లక్ష్మీసునీత ఆర్‌డిఒ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వ విధానం ప్రకారంలో మరో పది రోజుల్లో నాణ్యమైన ఇసుక స్టాక్ వస్తుందని చెప్పారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ పొట్టూరి సతీష్, గ్రామ రెవెన్యూ అధికారి ఈశ్వరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చట్టాలపై అందరికీ అవగాహన అవసరం

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో రత్నప్రసాద్ శుక్రవారం స్థానిక గుప్త ఇండస్ట్రీస్‌లో మహిళా కార్మికులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంస్థలో యాజమాన్యం కార్మికులకు కనీస వసతులను ఏర్పాటు చేయాలని, వారికి అందుబాటులో ఉన్న పథకాల పైన అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే ప్రతి కార్మికుడు వ్యవస్థలో బాధ్యతతో పనిచేయాలని, వ్యవస్థ అభివృద్ధి చెందినప్పుడే కార్మికులు కూడా అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. అవసరమైన పక్షంలో కార్మికులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాధ్ మాట్లాడుతూ 14 ఏళ్ల దాటిన వ్యక్తులు ఫ్యాక్టరీస్ పరిధిలోకి వస్తారని, ఆ కార్మికులకు సమస్యలు ఎదురైతే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలబాలికలను పనిలోకి పంపింపరాదని, నిర్బంధ విద్యను అమలు చేయాలని, బాలల చదువుల కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అందిస్తున్నాయన్నారు. బాలలను చిన్న వయసులోనే పనికి పంపించడం వల్ల వారి భవిష్యత్తు అంధకారమవుతుందని, అభివృద్ధి చెందే వయసులో పనిభారం మోపరాదని తెలిపారు. బాలలతో పని చేయిస్తే చట్టం తీవ్రంగా శిక్షిస్తుందని, ఈ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో కలిసి ఎన్నో అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నామని, బాల కార్మికులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.శ్రీనివాసరావు గుప్తా ఇండస్ట్రీస్ మేనేజర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యాధి నిరోధక విభాగ అధికారి డి.దేవి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్యా శాఖాధికారిణి ఎస్.శర్మిష్ఠతో కలిసి జీలుగుమిల్లి పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ శర్మిష్ఠ మాట్లాడుతూ వాతావరణంలో జరిగే మార్పుల వల్ల వైరల్ జ్వరాలు అధికంగా వస్తున్నాయని, జ్వరాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నందున ప్రజలు ప్రయివేట్ ఆసుపత్రుల మాయలో పడి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా డెంగీకి సంబంధించి కిట్లు, వ్యాధి నిరోధక మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతంతో పోల్చితే మలేరియా, టైఫాయిడ్ కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రజలు ఇంటి ఆవరణలో డ్రెయినేజీ నీరు, మురుగునీరు లేకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిఎంపిలు, ఆర్‌ఎంపిలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని హెచ్చరించారు. వారితో పాటు జిల్లా సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ, వైద్యాధికారిని గాయత్రి, నాగేశ్వరరావు, మంగ, సువర్ణ, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న దేవి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వర్జీనియా పొగాకు కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రంలో వర్జీనియా పొగాకు కేంద్రాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ధరలు, ఏదైనా ఇతర సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్‌గా ఉన్న సమస్యలు, ప్రకృతి విపత్తు వచ్చినప్పుడు సత్వర పరిష్కారం చూపాలని రైతులు కోరారు. ఎంపీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు వచ్చినా స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు చెప్పారు. ఆయనతో పాటు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, పొగాకు రైతులు, స్థానిక జనసేన, టిడిపి నాయకులు ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎంపీ మహేష్‌కుమార్

పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని బండివారిగూడెం సర్పంచి నాళం టిరీషా కాశీ అన్నారు. బండివారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్న సర్పంచి దంపతులను శుక్రవారం పాఠశాల హెచ్ఎం డి.బాజా, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి టిరీషా దంపతులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం హెచ్ఎం బాజా మాట్లాడుతూ సర్పంచి దంపతుల సహకారంతో సుమారు రూ.35 వేలతో మెయిన్ రోడ్డు నుంచి పాఠశాల ప్రవేశ ద్వారం వరకు ర్యాంపు నిర్మాణం, బండివారిగూడెం ఆర్యవైశ్య సంఘం తరపున పాఠశాలలో జాతీపిత మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను పాఠశాలకు అందించారని, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షా సప్తావ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చదువుతున్న పిల్లలు, తల్లిదండ్రులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి, గ్రామస్తులకు భోజనాన్ని ఏర్పాటు చేసి తమ గొప్పతనాన్ని చాటుకున్నారని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి సర్పంచి దంప తుల సహకారం అభినందనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచి దంపతులకు ఎంఇఒ టి.రామ్మూర్తి, హెచ్ఎం, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కొత్త ఈదర గ్రామంలో అవగాహనా ర్యాలీ

హెచ్ఐవి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కొత్త ఈదర గ్రామ సర్పంచి బెక్కం రాజగోపాల్ అన్నారు. మండల పరిధిలోని కొత్త ఈదర గ్రామంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఎపి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థల సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో మీకు తెలుసా అనే కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో హెచ్ఐవి వ్యాప్తికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ సుందరరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ హజరాబి, ఎంపిటిసి సభ్యులు బెక్కం వెంకట శ్రీనివాసరావు, సిహెచ్ఒ వసుంధర, లింక్ వర్కర్ రాధిక, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అచ్యుతాపురం ఘటనలో యాజమాన్యాన్ని శిక్షించాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అచ్యుతాపురం ఫార్మా కంపెనీ పేలుడులో పదుల సంఖ్యలో కార్మికుల మరణానికి కారకులైన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లి ప్రాంతంలోని అచ్యుతాపురం సెజ్ పరిధిలో 2019లో స్థాపించిన ఎస్సెన్షియ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రయివేట్ లిమిటెడ్ అనే ఫార్మా కంపెనీలో ఈ నెల 21న సంభవించిన పేలుడులో మరణించిన, గాయపడిన కార్మికులకు యాజమాన్యాలే భారీ పరిహారం చెల్లించాలని, ఈ ఘటనకు బాధ్యులైన పరిశ్రమ యజమానులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

కుక్కునూరు :అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, పర్యవేక్షించని అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్ చేసింది. అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై పార్లమెంట్, శాసనసభల్లో చర్చలు జరిపి, తీర్మానాలు చేయించి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

25న ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న రెవెన్యూ భవన్‌లో ఎపిజెసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం, మధ్యాహ్నం 2.30 నుంచి ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎపిజెసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపిజెసి అమరావతి రాష్ట్ర కార్యవర్గం, సభ్య సంఘాల రాష్ట్ర న్యాయకత్వం, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

భూదాన యజ్ఞ భూములను స్వాధీనం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎస్సి, బిసిలకు చెందిన భూదాన యజ్ఞ భూములను తక్షణం స్వాధీనం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. నిరుపేదలకు చెందిన భూదాన యజ్ఞ భూముల స్వాధీనం చేయాలని కోరుతూ మాదేపల్లి గ్రామస్తులతో కలిసి ఏలూరు ఆర్‌డిఒకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1983లో ప్రభుత్వం తాడువాయి గ్రామంలో సర్వే నెంబర్ 99 నుంచి 140 వరకు ఉన్న సర్వే నెంబర్లలో సుమారు వంద మందికి ఒక్కొక్క కుటుంబానికి ఎకరం చొప్పున భూదాన యజ్ఞం కింద కోర్టు పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఆ భూములు తుప్పలు, మళ్ళ పొదలతో ఉండగా వాటిని ఎస్సి, బిసిలు బాగు చేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. కొంతకాలం తరువాత వారికి తగినంత ఆర్థిక స్తోమత లేని కారణంగా బయట వ్యక్తులకు కౌలుకు ఇచ్చారని తెలిపారు. కౌలు దారులు సక్రమంగానే కౌలు చెల్లించి, తరువాత ఉద్దేశపూర్వకంగా రెవెన్యూ వారితో కుమ్మక్కై భూదాన యజ్ఞం కింద ఇచ్చిన భూములను రెవెన్యూ లెక్కల్లో కౌలుదారుల పేరున నమోదు చేశారని ఆరోపించారు. పేదలు హైకోర్టును ఆశ్రయించగా, 2021 జనవరి 21వ తేదీన భూముల స్వాధీనం చేయాలని తహశీల్దార్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. జంగారెడ్డిగూడెం తహశీల్దార్ హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో ఆ కారణం సమాచారం చూపి తాను ఏమీ చేయలేదని తెలిపారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణం జోక్యం చేసుకొని పేదలకు చెందిన భూదాన యజ్ఞం భూములను స్వాధీనం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జెవి.రమణరాజు, తాడువాయి గ్రామ శాఖ కార్యదర్శి త్రిమూర్తులు, కానూరి కోనేరావు, కంకిపాటి రామారావు, పొనుకుమాటి వెంకట శివ, పి.యూస్సీ ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - పెదపాడు

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కలపర్రు జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఎపి16హెచ్16పై విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ సాంకేతిక లోపంతో ఆగిపోయింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక ఉన్న లారీ డ్రైవర్ గాయాలపాలయ్యాడు. స్థానికులు రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన డ్రైవర్‌ను అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో చోటు చేసుకుంది. ఏలూరు మూడో పట్టణ పరిధిలోని భోగాపురం ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన బి.నాగరాజు (45) స్థానికంగా ఉన్న ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా ఇతను ముభావంగా ఉంటున్నాడు. గురువారం ఉదయం ఏలూరు నగరంలోని ఆర్ఆర్.పేట ప్రాంతంలో ఉన్న ఫైనాన్స్ కంపెనీలో అతను పురుగుమందు తాగి పడుకొని ఉన్నాడు. ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం వచ్చి అడగగా తాను పురుగుమందు తాగినట్లు తెలిపాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై రెండో పట్టణ ఎస్ఐ మదీనాబాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామసభలు

ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పంచాయతీలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామ సభల సేవలు వినియోగించుకోవాలని ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ కోరారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. భీమడోలులో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌డిఒ, మండల ప్రత్యేకాధికారి ఖాజావలీ హాజరయ్యారు. గ్రామ సర్పంచి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మావతి దేవి, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. గ్రామసభ కన్వీనర్‌గా గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సూర్యకుమార్ వ్యవహరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వలసలను తగ్గించేందుకు ఉపాధి హామీ నిధుల కేటాయింపును పెంచాలని కోరారు. గుండుగొలనులో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవినీతి చోటు చేసుకుందని భీమడోలు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వివివి.భాస్కర్ ఆరోపించారు. ఈ విషయమై వినతిపత్రాన్ని గ్రామ సభలో అందించారు. కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ విచారణ జరుపుతామని తెలిపారు. పోలసానిపల్లిలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ, ఎంఎల్‌ఎ ధర్మరాజు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామానికి తొలిసారిగా వచ్చి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎను సర్పంచి దంపతులు సత్కరించారు. ఇప్పటికే గుర్తించిన సమస్యల గురించి శాసనసభ్యులతో వాటి పరిష్కారం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల స్థాయి అధికారులు, ఎంపిటిసి సభ్యులు అంబటి దేవి నాగేంద్రప్రసాద్, కూటమి రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం:పరింపుడి గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ చెరువు పూడికలు కొనసాగించాలని, వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలని, రూ.600 కనీస వేతనం ఇవ్వాలని, ప్లే స్లిప్పులు 15 రోజులకు ఒక్కసారి ఇవ్వాలని, ఉపాధి హామీలో యంత్రాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. గ్రామసభలో ప్రత్యేకాధికారి బిఆర్.శ్రీనివాసరావుకు అందించారు.

జీలుగుమిల్లి : మండలంలోని 12 పంచాయతీల్లో గ్రామసభలు పారదర్శకంగా నిర్వహించినట్లు ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్ తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 12 పంచాయతీల్లో ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులతో పాటు మండల స్థాయి అధికారి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పించి, ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు గ్రామ సభలో అధికారులను కోరారు. అనంతరం కార్యదర్శి అశోక్‌కి సిపిఎం నాయకులు అప్పారావు, కొండలరావు వినతిపత్రం అందించారు.

ఉంగుటూరు :సమిష్టి నిర్ణయంతోనే గ్రామాలు అభివృద్ధి చేసుకునేందుకే ఉపాధి హామీ చట్టంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎంఎల్‌ఎ ధర్మరాజు అన్నారు. మండలంలోని నాచుగుంట గ్రామ సర్పంచి ఏలేటి సునీత అధ్యక్షతన నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో రోడ్డు, డ్రెయిన్లు, ఇతర సమస్యలను గుర్తించి వాటికి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపితే ఉపాధి హామీ నిధులు వస్తాయన్నారు. వాటితో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని వివరించారు. ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు గంటా ఉషారాణి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి జివి.గిరిధర్, పంచాయతీ కార్యదర్శి నీలం ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీమడోలులో...

టి.నరసాపురం : మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం గ్రామసభలకు ప్రజలు అనేక సమస్యలు విన్నవించారు. టి.నరసాపురం బండ్రేవు వద్ద ఎర్రకాలువ వంతెన నిర్మించాలని, కొత్తగా గృహ నిర్మాణాలకు ఇళ్లు మంజూరు చేయాలని, అదేవిధంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలని, ఉపాధి పనులు కల్పించాలని ప్రజలు సభల దృష్టికి తీసుకొచ్చారని ప్రత్యేకాధికారులు ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, ఎపిఒ శ్రీనివాస్, ఎఒ సుమలత తెలిపారు. గ్రామసభల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ఉపాధి హామీ చట్టం ద్వారా చెరువులు, పంటకాలువలు, మొక్కల పెంపకం, మినీ గోకులం ఏర్పాటు తదితర అంశాలపై తీర్మానాలు చేసినట్లు వారు తెలిపారు.

నిడమర్రు : మండలంలోని తోకలపల్లి గ్రామ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన గ్రామసభలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలపై అందరూ ఏకతాటి పైకి వచ్చి వాటి పరిష్కారానికి సంబంధించిన తీసుకోవాల్సిన చర్యలపై చర్చించికోవాలని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మండలంలోని అడవికొలనులో నిర్వహించిన గ్రామసభలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గవర సత్యనారాయణ, కానూరు రాజు, పాపోలు రాంబాబు వినతిపత్రం అందించారు. భువనపల్లి గ్రామసభలో ఎంపిడిఒ జి.విజయ్‌కుమారి, వ్యవసాయ శాఖాధికారి రాంబాబులను సిపిఎం నాయకులు కలిసి ఇందిరమ్మ కాలనీ, కొత్తగా నిర్మించిన జగనన్న కాలనీల్లో రహదారులు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించి డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించినవారిలో సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు, కె.శ్రీనివాసరావు, మోహన్, గవర సత్యనారాయణ, శ్రావణి ఉన్నారు.

కుక్కునూరు : కుక్కునూరులో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు పలు సమస్యలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు పంచాయతీ కార్యదర్శి మండల ఇరిగేషన్ అధికారి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, జనసేన, బిజెపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో పలు పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి పలు అభివృద్ధి పనుల విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా పోలవరం పంచాయతీలో అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని పంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగిన కొండ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్నాథపేట అంగన్వాడీ తమకు కిలోమీటరు దూరంలో ఉండి ఇబ్బందిగా ఉందని, మేజర్ డ్రెయినేజీ చేసి శాశ్వత పరిష్కారం చేయాలని జగన్నాథపేట గ్రామస్తులు కోరారు. కొతపట్టిసీమ పంచాయతీలో పశుశాలల లబ్ధిదారుల ఎంపికలో తమ పేర్లు లేవని, వారికి కావాల్సిన వారిని పశువైద్య అధికారులు ఎంచుకున్నారని, మళ్లీ లబ్ధిదారుల ఎంపిక చేయాలని పాడి రైతులు కోరారు. గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణం విషయంలో అడ్డంకులు తొలగించి డ్రెయినేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

కలిదిండి : ఉపాధిహామీ చట్టంలో వ్యవసాయ అనుబంధ పనులను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ గ్రామ సభల్లో ప్రజా సంఘాల కార్యకర్తలు ఉపాధి కూలీల సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందించారు. వీరవల్లి భాస్కరరావు, బుస్సా రామ నాగేంద్రం, గంట సోమయ్య, గోసంగి వినోద్, పాతపాటి శాంతరాజు, జమ్ము దుర్గ, జి.రాణి, కె.విజయ, వి.మీనాకుమారి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని పంగిడిగూడెం, నాగులగూడెం, కేతవరం, తాడువాయి, ఎ.పోలవరం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం పాల్గొన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల్లో గ్రామ చెరువులను కూడా చేర్చి పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అనుసంధానం చేసే పనులను విరమింపచేయాలని కోరారు. 200 రోజులు పనులు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని, అడిగిన ప్రతి ఒక్కరికీ జాబు కార్డులు ఇవ్వాలని గ్రామసభలో అధికారులకు, ఎంపిడిఒకు వినతిపత్రాలు అందించామని తెలిపారు. ఈ గ్రామసభల్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు, యాగంటి సీత, సిహెచ్.లక్ష్మీనారాయణ, పటాన్ మస్తాన్, నిట్ట నాగరాజు, జోడే సూర్యచంద్రరావు, వామిశెట్టి నరసరావు, జి.సూర్యకిరణ్, ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి : గ్రామపంచాయతీలను స్వర్ణ గ్రామపంచాయతీలుగా చేసి గ్రామాభివృద్ధికి ప్రజలు తోడ్పాడలని ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, మండల ప్రత్యేకాధికారి నాగరాణి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు. శ్రీహరిపురం, పెదపాలపారు గ్రామాల్లో జరిగిన సభలో ఎంపిడిఒ మల్లేశ్వరి మాట్లాడుతూ పారిశుధ్య చర్యలు, పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రామ సభలను వినియోగించుకొని ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. మండల వ్యాప్తంగా జరిగిన అన్ని గ్రామసభల్లో ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. దీనికి తోడు వ్యవసాయ పనులు సాగుతుండడంతో గ్రామ సభలకు ప్రజలు హాజరయ్యేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో చాలా సభలో సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలే ఎక్కువగా కనిపించారు. ముదినేపల్లి ,శ్రీహరిపురం, వడాలి, గురజ, పెదపాలపర్రు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో ప్రజలు తక్కువగా హాజరయ్యారు.

మండవల్లి : మండవల్లి సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో డిప్యూటీ కలెక్టర్ బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనులపై నిర్వహించాల్సిన పనులను త్వరితగతం గుర్తించి పనులు నిర్వహించేలా నివేదికలను అనుమతుల కోసం పంపాలన్నారు. 13 మంది వార్డు సభ్యులు ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే పాల్గొనడంపై ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు ప్రశ్నించారు. కూలీ పనికి రాకుండా ఇంటి దగ్గర ఉన్న వారికి కూడా డబ్బులు ఇస్తున్నారని కూలీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇంగిలిపాకలంక, పుల్లపర్రు గ్రామాల్లో పది గంటలకు ప్రారంభించాల్సిన గ్రామసభ ప్రత్యేకాధికారులు సకాలానికి రాకపోవడంతో సుమారు 11:30 గంటలకు ప్రారంభించారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన ప్రముఖులు పుప్పాల మోహన సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన వారసులు సుమారు రూ.15 వేల విలువైన మైక్ సిస్టంను శుక్రవారం పాఠశాలకు అందించారు. పాఠశాల వద్ద గతం నుంచి మైక్ సిస్టం పనిచేయని కారణంగా వివిధ సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బంది ఎదురయ్యేది. దీనిపై స్పందించిన పాఠశాల యాజమాన్య నూతన కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.రామలక్ష్మి, కె.నాగ సావిత్రి సమస్య గురించి పుప్పాల మోహన్ సీతారామయ్య వారసులతో చర్చించారు. ఈ మొత్తాలతో కొనుగోలు చేసిన మైక్ సిస్టంను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం అందించారు.

రాధ - రంగా మిత్రమండలి నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కలిదిండి

ప్రధాన సెంటర్‌లో ఆంధ్రా, తెలంగాణా రాధ - రంగా మిత్రమండలి ఛారిటబుల్ ట్రస్ట్ నూతన కార్యాలయాన్ని వ్యవస్థాపక అధ్యక్షులు చెన్నుపాటి శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్ ప్రారంభించారు. ఆంధ్ర తెలంగాణా రాధ రంగా మిత్ర మండలి అధ్యక్షులు పన్నాస పూర్ణచంద్రరావు(కాళ్ల పాలెం బుజ్జి) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాపు జెఎసి అధ్యక్షులు అమ్మ శ్రీనివాసరావు, చిట్టూరి రవీంద్ర, జనసేన నియోజకవర్గ నాయకులు చలపతిరావు, చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు హనుమ ప్రసాద్, జబర్దస్త్ యాక్టర్లు బాబి, నవీన్ పాల్గొన్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

ఎపిఇపిడిసిఎల్ సిజిఆర్ఎఫ్ బృందం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో విద్యుత్ వినియోగదారులకు సమస్యలు ఉంటే తక్షణమే ఫిర్యాదు చేయవచ్చని ఎపిఇపిడిసిఎల్ సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. జీలుగుమిల్లిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రైతులకు అందించే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. దానికి గాను టోల్ ఫ్రీ నెంబర్ 1912కి లేదా 949037405 నెంబర్‌కి వాట్సప్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఆ సమస్యలను 60 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2016 నుంచి మొత్తం 8091 ఫిర్యాదులు రాగా 7962 వరకు పరిష్కరించినట్లు తెలిపారు. 103 కేసులకు సంబంధించి వినియోగదారులకు నష్టపరిహారం కూడా అందించినట్లు తెలిపారు. నెలలో ఒకసారి ఒక జిల్లాను కేటాయించి అవగాహనా సదస్సులు కూడా పెడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యుత్ సంబంధిత సమస్యలపై అవగాహనా సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.జనార్దన్‌రావు, శ్రీనివాస్, సురేంద్ర, ఎఇ నాగేషులు, విద్యుత్ లైన్‌మెన్లు వెంకటరత్నం, జగన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురంలో జ్వరంతో యువకుడు మృతి

పారిశుధ్య నిర్వహణపై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నల్లమాడు పంచాయతీ పరిధికి చెందిన రామచంద్రపురంలో ఈ నెల 22వ తేదీన 19 ఏళ్ల యువకుడు జ్వరంతో మృతి చెందాడు. నాలుగు రోజుల నుంచి ఈ యువకుడు జ్వరంతో తాడేపల్లిగూడెం ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 22వ తేదీన ఉదయం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఆరోజు మధ్యాహ్నం మృతి చెందాడు. రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోవడం వల్లే మృతి చెందినట్లు రాజమండ్రి ఆసుపత్రి వైద్యులు వెల్లడించారని కుటుంబసభ్యులు చెబుతున్నారు. గ్రామంలో గత కొన్ని నెలలుగా తాగునీరు కలుషితమవుతుందనే అనుమానంతో పలువురు ప్రజలు బయట నుంచి ఆర్ఒ ప్లాంట్‌లోని కొని తెచ్చుకుంటున్నారు. నీటిలో క్లోరినేషన్ సక్రమంగా చేయడం లేదని, మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉందని పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. గ్రామంలో చాలా మంది వైరల్ జ్వరాల బారిన పడుతు న్నారు. ప్రతి బుధవారం తాగునీటిని టెస్ట్ చేయిస్తున్నామని, ఎలాంటి సమస్య లేదని, పారిశుధ్యం ఎప్పటికప్పుడు చేయిస్తూ తాగునీటి పైపు లీకులు ఇటీవల అరికట్టామని పంచాయతీ కార్యదర్శి యాళ్ల కిషోర్‌బాబు చెప్పారు. మృతి చెందిన యువకుడు పుట్టుకతోనే శరీర, మానసిక వైకల్యంతో దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతుండేవాడని సెక్రటరీ చెప్పారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మహాత్ముల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడవాలని నూజివీడు ఆర్‌డిఒ వై.భవానీశంకరి అన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

చాట్రాయి :మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం సంఘ సంస్కర్త,న్యాయ నిపుణులని, 1953లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. రెండు వేల మంది ఖైదీలకు క్షమాభిక్ష పెట్టారని, తిరుపతిలో వెంకటేశ్వర యూనివర్సిటీని స్థాపించారని, విజయవాడలో కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీని నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు : మండల కేంద్రమైన నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించామని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు దాసరి అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సాంఘిక ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ గోపీకృష్ణ చలపతి, లక్ష్మణరావు, లావణ్య దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని చింతపండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలు : విద్యార్థుల అభ్యున్నతి కోరుతూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్న అన్నేవారి గూడెం ఎంపిపి ప్రాథమిక ఉన్నత పాఠశాల యాజమాన్యం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మస్తాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని, ఇదే క్రమంలో చంద్రయాన్ యాత్ర విజయవంతమైన నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు సేవల గురించి ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఆ తర్వాత ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు తయారుచేసిన చంద్రయాన్ నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, విజయ, జ్యోతి పాల్గొన్నారు.

చెరువుకు గండి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని సమ్మెటవారిగూడెం కలిదిండి చెరువుకి గండి పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తే నష్టం వాటిల్లుతుందని ఎవరూ బాధ్యత వహిస్తారని అధికారులను రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకుని గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ తవ్వకం నిలిపివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదర్రులో గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా రొయ్యల చెరువు తవ్వకం చేస్తున్న విషయమై ఈ నెల 21న ప్రజాశక్తిలో వణుదుర్రులో చెరువు అక్రమ తవ్వకం శీర్షికతో ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్తపై స్పందించిన మండల రెవెన్యూ అధికారులు రొయ్యల చెరువు తవ్వకం పనులు వెంటనే నిలుపుదల చేయించారు. తహశీల్దార్ సుభాని ఆధ్వర్యంలో గ్రామ విఆర్ఒలు చెరువు వద్దకు వెళ్లి తవ్వకం చేస్తున్న రెండు జెసిబిలను బయటకు పంపించి వేసి చెరువు తవ్వకం పనులు చేయరాదంటూ సదరు వ్యక్తిని హెచ్చరించారు.

అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ, బోటని అతిథి అధ్యాపకుల కోసం శుక్రవారం స్థానిక కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు కెమిస్ట్రీ సబ్జెక్టుకు ఇద్దరు హాజరు, బోటనీ సబ్జెక్టుకు ఒకరు హాజర య్యారని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. అందులో కెమిస్ట్రీ సబ్జెక్టుకు కొవ్వాల మణిని, బోటని సబ్జెక్టుకు విష్ణును ఎంపిక చేసినట్లు తెలిపారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇసిఇ డిపార్ట్‌మెంట్ స్పేస్, శాటిలైట్ సిస్టమ్స్ క్లబ్, మెకానికల్ విభాగానికి చెందిన ఆర్‌యుకెజి ఏరోడైనమిక్ క్లబ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా లూనార్ పాత్‌ఫైండర్ ఛాలెంజ్, స్పిన్ లాంచ్ షోడౌన్, ఇండియన్ స్పేస్ స్పెక్ట్రమ్ (పోస్టర్ ప్రెజెంటేషన్), స్పేస్ బైట్స్ (క్విజ్), స్పేస్ ఆర్టిస్ట్రీ (డ్రాయింగ్ కాంపిటీషన్), రాకెట్ సిస్టమ్ ప్రోటోటైప్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ ఎన్.రత్నాకర్, ఇసిఇ హెచ్ఒడి పి.శ్యామ్, మెకానికల్ హెచ్ఒడి యు.పావని, ప్రోగ్రాం కన్వీనర్ జి. భరత్ అభినందించారు.

జెఎసి నాయకుల నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

టి.నర్సాపురం మండలం బంధంచర్ల గ్రామంలో దళిత యువకుడిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ చింతలపూడి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు జెఎసి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు కలుకుర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత్ బంద్ రోజు టి.నర్సాపురం మండలం బంధంచర్ల గ్రామంలో హోటల్ మూసివేయమన్నందుకు ఆ హోటల్ యజమాని పవన్‌కుమార్ అనే యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనికి బాధ్యులైన వారిని పోలీసులు ఇప్పటివరకు అరెస్టు చూపలేదన్నారు. వారిని వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేసి నిందితుడిని శిక్షించాలని, లేకపోతే చలో టి.నర్సాపురం, చలో బంధంచర్ల పిలుపునివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

132/33 కెవి మండలంలోని చిగురుకోట సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల నిమిత్తం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కింది సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలన్నారు. కలిదిండి మండలంలో కలిదిండి సబ్ స్టేషన్, పోతుమర్రు, కోరుకొల్లు, మూల లంక, కాళ్లపాలెం సబ్‌స్టేషన్లలో, కైకలూరు మండలంలో కైకలూరు సబ్ స్టేషన్, వరాహపట్నం, పల్లేవాడ సబ్‌స్లేషన్లలో, ముదినేపల్లి మండలలో చిగురుకోట సబ్ స్టేషన్, సింగరాయపాలెం, కొత్తపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ప్రకటన
మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ఏలూరు
E.A.8/2024, E.P.5/2019 in O.S.47/2018
బిట్వీన్ :
మల్లిడి సునీల్‌రెడ్డి ...డిక్రీ హోల్డర్
మరియు
కలిమెల కిషోర్‌బాబు, S/o.జోసఫ్, వ్యాపారం, R/o.Opp.ఫైర్‌స్టేషన్, నరశింహారావుపేట, ఏలూరు, ప.గో.జిల్లా. ...జడ్జిమెంటు డెటార్
పై నెంబరు E.P లో కోర్టు వారు నిర్ణయించిన ప్రారంభ ధరను తగ్గించమని కోరుచూ పిటీషను దాఖలు చేసినారు. సదరు పిటీషను ది.29-8-2024వ తేదీన 1వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున 1వ రెస్పాండెంటు అయిన కలిమెల కిషోర్‌బాబు పైకోర్టు వారి ఎదుట ది.29-8-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరు కావలెను. లేని ఎడల రెస్పాండెంటు పరోక్షంలో సదరు పిటీషను తీర్మానించబడును.
షెడ్యూలు : ఏలూరు జిల్లా, ఏలూరు టౌన్, పోస్టల్ కాలనీలోని గోవిందరాజపురం, హౌసింగ్ కాలనీ, శ్రీ శ్రీనివాసా కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లే-అవుట్ నెం.33/73లోని ప్లాట్ నెం.130 in R.S.No.119/2లో 348-0-0 చ॥గ॥ల స్థలం, అందులో గల ఆర్.సి.సి. బిల్డింగుకు హద్దులు.
తూర్పు : ఫిషరీస్ డిపార్టుమెంటు వారి స్థలం. దక్షిణం: ప్లాటు నెం.129. ఉత్తరం:రోడ్డు. పడమర:రోడ్డు.
బి.గౌరీశంకర్, శ్రీమతి ఎ.శోభారాణి
ఏలూరు ఎ.వి.ఎస్.సూర్యారావు
ది.23-8-24 అడ్వకేట్స్, ఏలూరు.